క్లుప్తంగా

25 నుంచి 'ఓపెన్' పరీక్షలు

సిరిసిల్లఎడ్యుకేషన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) టెన్త్, ఇంటర్ పరీక్షలు ఈనెల 25 నుంచి వచ్చేనెల 2వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి రమేశ్ తెలిపారు. ఏమైనా సందేహాలుంటే 94414 40849 హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పట్టణంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం


పూజలు చేస్తున్న అర్చకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలంలోని నారాయణపూర్‌లో వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దత్తత ఆలయమైన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం అర్చకులు బ్రహ్మోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈనెల 16 నుంచి 20 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. మొదటి వేదపండితులు హోమం కాల్చి గరుడ చిత్రపటాన్ని ధ్వజస్తంభానికి కట్టి అంకురార్పణ చేశారు. 17న శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సూర నర్సయ్య,ప్రధాన అర్చకులు వేణుగోపాలచారి తెలిపారు. మాజీ సర్పంచులు దొమ్మాటి నర్సయ్య, నిమ్మ మల్లారెడ్డి, లింగాల అంజాగౌడ్, నిమ్మ లక్ష్మి, ఎంపీటీసీ అపెరా సుల్తాన, నాయకులు నిమ్మ సుధాకర్ రెడ్డి, వెంకట్‌రాజ్, మల్లారెడ్డి, నర్సయ్య, లక్ష్మారెడ్డి, భాస్కర్, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు


బోనాలతో వెళ్తున్న మహిళలు

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ బోనాలు తీశారు. మహిళలు బోనాలతో ఎల్లమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు పొన్నం తిరుపతి, తాళ్లపెల్లి శ్రీకాంత్, వెంగళ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత


బహుమతి అందిస్తున్న తహసీల్దార్ పుష్పలత

బోయినపల్లి: రంగోత్సవ్ సెలబ్రేషన్స్ ముంబై ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి ఆర్ట్ పోటీల్లో కొదురుపాక హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత విద్యార్థినులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. కుదుదుల మహేశ్వరి అంతర్జాతీయ స్థాయిలో రెండో బహుమతి సాధించగా వల్లంపట్ల వైష్ణవి, బాలగోని ప్రజ్ఞ మెరిట్ అవార్డులు, కే. శ్రీహర్ష, టీ. సంయుక్త, పి. అభిజితశ్రీ, ఏ.సుస్మిత, ఎస్. సహర్ష, వీ.సాహిత్య, ఏ. అనుష్క, ఎస్. వైష్ణవి, ఎం. అక్షిత మెడల్స్ సాధించినట్లు హెడ్ మాస్టర్ తెలిపారు. ఆర్ట్ టీచర్ రాజు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే దీక్షలు'


మాట్లాడుతున్న యెల్ల బాల్‌రెడ్డి

ముస్తాబాద్: ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే బీజేపీ దీక్షలు చేపట్టిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, జెడ్పీటీసీ గుండం నర్సయ్య అన్నారు. మండల పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడారు. రైతులను ఏనాడు ఆదుకోలేని బీజేపీ నాయకులు నేడు రైతుల కోసం దీక్ష అనడం విడ్డూరంగా ఉందన్నారు. కేవలం ఎన్నికల్లో ఓట్ల కోసం దీక్షలు చేపట్టే బీజేపీని ప్రజలు గమనిస్తున్నారన్నారు. నాయకులు రాజిరెడ్డి, రాంరెడ్డి, తలారి నర్సింలు, కొండల్‌రెడ్డి, రంజాన్ నరేశ్, భాను, ఉచ్చిడి బాల్‌రెడ్డి, గూడ లక్ష్మారెడ్డి, అంజనేయులు, నవీన్, శివ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ విజయ సంకల్ప అభియాన్'

గంభీరావుపేట: మండలంలోని ముస్తఫానగర్‌లో బీజేపీ నాయకులు మంగళవారం విజయ సంకల్ప అభియాన్ నిర్వహించారు. ఓటర్లకు విజయ సంకల్ప పత్రాలను అందించారు. ఎంపీగా బండి సంజయ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణకాంత్ యాదవ్, నాయకులు ఎల్లం, ప్రశాంత్ రావు, నారాయణ పాల్గొన్నారు.

రహదారుల వెంటే ధాన్యపు రాశులు


వెంకటాపూర్‌లో సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై రైతులు ధాన్యం ఆరబోశారు. చీకట్లో ధాన్యపు రాశులు కనిపించక వీర్నపల్లి మండలం సీతారాం నాయక్ తండాకు చెందిన భూక్య రమేశ్, రాజం ఇటీవల ప్రమాదబారినపడ్డారు. ధాన్యం కాపలా ఉన్న మల్లయ్య అనే రైతు వాహనం ఢీకొనడంతో స్పృహ కోల్పోయాడు. రోడ్డుపై ధాన్యం ఆరబోస్తుండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.


ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు దుమాలకు చెందిన దేవరాజు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా సౌకర్యాలు కల్పించడం లేదు. దీంతో రైతులు రోడ్లపైనే ధాన్యం ఆరబోసి అక్కడే అమ్ముకుంటున్నారు. గతంలో రైతులు ప్రమాదాల బారినపడిన సంఘటనలున్నాయి. ప్రతి సీజన్‌లో భయంభయంగా రోడ్డుపై ధాన్యం ఆరబోస్తున్నానని దేవరాజు తెలుపుతున్నాడు. ఒక దేవరాజు కాదు. మండలంలో చాలామంది రైతులు పరిస్థితి ఇలాగే ఉంది.


దుమాలలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

- మండలంలో 15 కొనుగోలు కేంద్రాలు
- 14 కేంద్రాలకు స్థలాలు కరువు
- రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

ఎల్లారెడ్డిపేట: రైతులు ధాన్యం అమ్ముకునేందుకు అరిగోస పడుతున్నారు. సరైన స్థలాలు లేక ప్రధాన రహదారుల వెంట ధాన్యం ఆరబోస్తూ ఇబ్బందులు పడుతున్నారు. మండలవ్యాప్తంగా 15 కొనుగోలు కేంద్రాలు ఉండగా, కేవలం ఒకే కేంద్రానికి మాత్రమే స్థలం ఉంది. మిగిలిన 14 కొనుగోలు కేంద్రాలకు సరైన స్థలాలు లేక రైతులు రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తున్నారు. నిర్వాహకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సరైన సౌకర్యాలు కల్పించడం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

కాగితాలకే పరిమితం..

రైతులు ధాన్యం ఆరబోసుకునేందుకు ప్రత్యేక కల్లాల ఏర్పాటు కాగితాలకే పరిమితమైంది. జిల్లావ్యాప్తంగా కనీసం వంద కల్లాలు కూడా ఏర్పాటు చేశారు. మండల 14 గ్రామ పంచాయతీల పరిధిలో 3 లోపే కల్లాల ఏర్పాటు చేసినట్లు అధికారులు అంచనా వేశారు. ఓ వైపు సరైన స్థలాలు ఏర్పాటు చేయకపోవడం మరోవైపు ధాన్యం తూకం వేయడంలో జాప్యం చేస్తుండడంతో రోజుల తరబడి రైతులు రహదారులపైనే రాత్రింబవళ్లు ధాన్యం అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

తరచూ ప్రమాదాలు..

సిరిసిల్ల–కామారెడ్డి, ఎల్లారెడ్డిపేట–వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట–గంభీరావుపేట, ముస్తాబాద్–గంభీరావుపేట, ముస్తాబాద్–తంగళపల్లి, సిరిసిల్ల–కోనరావుపేట, వేములవాడ–చందుర్తి, రుద్రంగి–మానాల, సిరిసిల్ల–జిల్లెల్ల ప్రధాన రహదారుల్లో రైతులు నిత్యం ధాన్యం ఆరబోస్తున్నారు. మండలవ్యాప్తంగా 14 కేంద్రాలకు స్థలాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రతి సీజన్‌లో రోడ్లపై ధాన్యం ఆరబెట్టుకునే పరిస్థితి నెలకొంది.రెండు సీజన్లలో ప్రమాదాలు జరిగి ఎనిమిది రైతులు తీవ్రంగా గాయపడ్డారు. గొరింట్యాల, వీర్నపల్లి, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, వేములవాడ, తంగళపల్లి శివారులో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా రాత్రిపూట ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. అయినా ప్రభుత్వం ప్రత్యేక స్థలాలు, లేదా స్థలాలను లీజ్‌కు తీసుకొని అన్ని సౌకర్యాలతో రైతులు ధాన్యం అమ్ముకునేందుకు వసతులు కల్పించడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు కేంద్రాలకు ప్రత్యేక స్థలాలు గుర్తించి ఇబ్బందులను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి


కొనుగోలు కేంద్రాలకు అనుకూలంగా గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేవు. స్థలాల గుర్తింపులో జాప్యం జరుగుతోంది. ప్రైవేట్ స్థలాలను లీజుకు తీసుకొని కేంద్రాలను ఏర్పాటు చేశాం. వచ్చే సీజన్ వరకు స్థలాల గుర్తింపు కోసం కృషి చేస్తాం. రైతులు రోడ్లపై ధాన్యం ఆరబెడుతున్న మాట వాస్తవమే.రైతులు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– మల్లేశం, ఐకేపీ ఏపీఎం, ఎల్లారెడ్డిపేట

ఓటుహక్కును వినియోగించుకోవాలి


సిరిసిల్లటౌన్: అవగాహన కల్పిస్తున్న కళాకారులు


ముస్తాబాద్: ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

సిరిసిల్లటౌన్: స్వీప్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సాంస్కృతిక కళాకారులు సిరిసిల్లలో కళా ప్రదర్శన నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లా సాంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎడ్మల శ్రీధర్‌రెడ్డి, శ్రీరాముల రామచంద్రం, గడ్డం శ్రీనివాస్, వంతడ్పుల గణేశ్, గుగ్గిళ్ల పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఉషోదయ మండల సమాఖ్య సభ్యులకు స్వీప్–2024 కార్యక్రమంపై ముగ్గులపోటీలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు 'ఓటుహక్కు నా బాధ్యత' అంశంపై ముగ్గులు వేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. అడిషనల్ డీఆర్డీవో గొట్టె శ్రీనివాస్, డీపీఎం పద్మయ్య, ఏపీఎం రాకేశ్, డీఎంజీ అంజయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు యమున, వీవో అధ్యక్షుడు, వీవోఏలు, సీసీలు పాల్గొన్నారు.

వీర్నపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులైన వారు ఓటుహక్కు వినియోగించుకోవాలని అధికారులు పేర్కొన్నారు. స్వీప్ ఆధ్వర్యంలో రంగోలి, మెహందీ పోటీలు నిర్వహించారు. మండలకేంద్రంలోని మండల సమాఖ్య భవనాల్లో రంగోలి పోటీలు నిర్వహించారు. సమాఖ్య బాధ్యులు 'ఐ ఓటు ఫర్ ష్యూర్' (ఓటు హక్కు నా బాధ్యత) పేరిట ముగ్గులు వేశారు. స్వీప్ నోడల్ అధికారి, అడిషనల్ డీఆర్డీవో గొట్టె శ్రీనివాస్ డీపీఎంలు, ఏపీఎంలు, మహిళా సమాఖ్య బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ఓటుహక్కు వినియోగించుకొని మహిళా శక్తిని చాటాలని మండల సమాఖ్య అధ్యక్షురాలు దేవిక అన్నారు. మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐకేపీ మహిళలు గ్రామాల్లో ఇంటింటా పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వారు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం దేవరాజు, కార్యదర్శి సంధ్య, కోశాధికారి లావణ్య, సీసీలు, గ్రామైక్య సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

'శ్రీరామనవమి'కి ఏర్పాట్లు



కోనరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మామిడిపల్లిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహించే వేడుకలకు కల్యాణ వేదిక సిద్ధం చేశారు. ఇక్కడ జరిగే కల్యాణానికి పలుగ్రామాల నుంచి అధికసంఖ్యలో భక్తులు హాజరవుతారు. కోనరావుపేట, నిమ్మపల్లి, ధర్మారం, కనగర్తి గ్రామాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు.

వీర్నపల్లి: మండలకేంద్రంతోపాటు పలు గ్రామాల ఆంజనేయ స్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. వీర్నపల్లిలోని సీతారాంజనేయస్వామి ఆలయం ఇప్పటికే భక్తులు ముస్తాబు చేశారు.

అభివృద్ధి, పథకాలను వివరించాలి


మాట్లాడుతున్న తోట ఆగయ్య

ముస్తాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేలా నాయకులు పనిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండలకేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. సీనియర్ నాయకుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, విజయరామారావు, నల్లనర్సయ్య, మల్లేశ్‌యాదవ్, నర్సింహారెడ్డి, బత్తుల అంజయ్య, పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

సిరిసిల్ల: సిరిసిల్లలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ ఎంపీగా బండి సంజయ్‌కుమార్ మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆడెపు రవీందర్, నాగుల శ్రీనివాస్, ఆడెపు రేవంత్, గాజుల సదానందం, వేముల పోశెట్టి, తాటిపాముల సత్యం, దీకొండ భాగ్య, ఎస్.డి.ఆస్మా, ఎస్.డి.పర్వానా, మ్యాన బాలకిషన్, అంబదాస్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: మండలంలోని ఫాజుల్‌నగర్ గ్రామంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి ప్రచారం నిర్వహించారు. బండి సంజయ్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. గత ఐదు సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామాలకు వచ్చిన నిధుల వివరాలపై వారికి అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహించారు. బూత్ కోఆర్డినేటర్‌లు, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చందుర్తి: బీజేపీ వేములవాడ అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య ఆధ్వర్యంలో మండలకేంద్రంలో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రధాని మోడీ పదేళ్ల సంక్షేమ పథకాలను గడపగడపకూ వివరించారు. కేంద్రంలో మరోసారి మోడీ ప్రధాని కావాలంటే బండి సంజయ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పోంచెట్టి రాకేశ్, నాయకులు లోలపు శేఖర్, చిలుముల హన్మయ్యచారి, మర్రి రమేశ్, సిరికొండ పర్శరాములు, తిప్పని భూమన్న, మేడిశెట్టి శ్రీహరి, తిప్పని సతీశ్, తదితరులు పాల్గొన్నారు.


వేములవాడరూరల్: ఫాజుల్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

వీర్నపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంచుతూ బీజేపీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. పోతారం నరేశ్, బోడ వెంకటేశ్, ప్రవీణ్, లింబాద్రి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బోయినపల్లి: కేంద్రప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని చొప్పదండి నియోజకవర్గ ప్రభారి రాజేశ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, నాయకులు మాడిశెట్టి విజయ్‌కుమార్, బోగోజి గంగాధర్‌చారి, తడుక రామానుజం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ఎల్లారెడ్డిపేట: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సింగిల్‌విండో, ఐకేపీ, రైస్‌మిల్లర్లను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య కోరారు. మండలకేంద్రంలోని పార్టీ ఆఫీస్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల్లోని రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. గత పదేళ్లుగా ఎన్నో ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు ఆ కష్టాలు రావొద్దని సూచించారు. ఆగస్టు వరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, వర్షాకాలం పంట వరకు రూ.500 బోనస్ అందుతుందని తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, పార్టీ యూత్ మండలాధ్యక్షుడు భానోత్ రాజునాయక్, నాయకులు బండారి బాల్‌రెడ్డి, కొత్తపల్లి దేవయ్య, సోషల్‌మీడియా ప్రతినిధి బీపేట రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అనుమతి ఒకరి పేరుపై.. పోసేది మరొకరికి

- ఇసుక వ్యాపారుల కొత్త పుంతలు
- అధికారుల పర్యవేక్షణ కరువు



గంభీరావుపేట: ఇసుక వ్యాపారులు గ్రామాల్లో కొత్త పుంతలు తొక్కుతున్నారు. ఒకరి పేరుపై అనుమతి తీసుకొని ట్రాక్టర్‌లో ఇసుక తీసుకొచ్చి మరొకరికి అధిక ధరకు విక్రయిస్తున్నారు. అనుమతి తీసుకున్న సమయానికల్లా ఇసుక అన్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కానీ నిర్ణీత సమయం దాటినా ట్రాక్టర్లు యథేచ్ఛగా నడుస్తున్నాయి. మండలంలోని రాజుపేటలో స్థానికులు ఇసుక వ్యాపారుల తీరు గురించి డయల్ 100కు ఫిర్యాదు చేశారు. పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకునే లోపే సదరు ట్రాక్టర్ ఇసుకను అన్‌లోడ్ చేసి వెళ్లిపోయింది. ఇసుక రవాణాపై అధికారుల పర్యవేక్షణ కరువైందని, డ్రైవర్లు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారని ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో అనుమతి లేని ట్రాక్టర్లు ఇసుక రవాణా చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇళ్ల నిర్మాణానికి ఇసుక అనుమతి తీసుకోవడానికి ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేసే అధికారులు ఇసుక అక్రమ రవాణా, నిబంధనలను ఉల్లంఘనపై చర్యలు తీసుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


సిరిసిల్ల: సీఎం రేవంత్‌కు వేములవాడ రాజన్న ఫొటోను బహూకరిస్తున్న పిట్టల భూమేశ్


ఎల్లారెడ్డిపేట: ఫొటోను బహూకరిస్తున్న వెంకట్‌రెడ్డి దంపతులు

సిరిసిల్ల/ఎల్లారెడ్డిపేట: జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రానవేణి లక్ష్మణ్ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిట్టల భూమేశ్, ఉపాధ్యక్షుడు జజ్జరి నర్సయ్య, ఎడ్ల రాజుకుమార్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్

మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్ రెడ్డి – మమతరెడ్డి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. సీఎం దంపతుల మనుమడు ఉన్న పెయింటింగ్ ఫొటోను బహుకరించారు. తనతోపాటు ఎల్లారెడ్డిపేట మండల రెడ్డి సంఘం మాజీ అధ్యక్షుడు గన్న మల్లారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ద్యాగం నారాయణ చందుపట్ల రాజిరెడ్డి, చందుపట్ల పద్మా రెడ్డి ఉన్నారు.


అంజిరెడ్డికి కండువా కప్పుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రెడ్డి సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు గంభీరావుపేట మండలం దమ్మన్నపేట మాజీ ఉపసర్పంచ్ అరుట్ల అంజిరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించండి

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్

వేములవాడఅర్బన్: కొనుగోలు కేంద్రాల్లోకి తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎప్పుడు కొనుగోలు చేస్తారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. వేములవాడ మండలం అనుపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో యాసంగిలో క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిందని, కనీసం మద్దతు ధర కూడా దక్కడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చే పంటకు బోనస్ ఇస్తామని మాట్లాడటం విడ్డూరమన్నారు. రూ.2 లక్షలు రైతు రుణమాఫీ చేస్తామని, మళ్లీ ఆగస్టులో రుణమాఫీ చేస్తామని అంటున్నారన్నారు. కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు దళారులకు రూ.1800 ధాన్యం అమ్ముకుంటున్నారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, నాయకులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

సంతోషంగా ఉండాలి..

ఆంజనేయుడి అనుగ్రహంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం హనుమాన్ ఆలయంలో హారతి కార్యక్రమానికి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, నాయకులు రామోహన్, అమిత్, అజిత్, జక్కుల నాగరాజు, సాయికృష్ణ తదితరులున్నారు.

నేటి నుంచి 'రాములోరి' బ్రహ్మోత్సవాలు



గంభీరావుపేట: మండలకేంద్రంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఏటా నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఏటా శ్రీరామనవమి నుంచి తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. రోజుకో వాహనంపై స్వామివారు పురవీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. చివరి రోజు రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఆలయంలో నిత్యం పల్లకీసేవ, నిత్యసేవ, హోమం నిర్వహిస్తారు. ఈనెల 17న స్వామివారి కల్యాణోత్సవం, 18న అశ్వవాహన సేవ, 19న గజవాహన సేవ, 20న సూర్యప్రభ వాహన సేవ, 21న శేష వాహనసేవ, 22న హనుమత్ సేవ, 23న పొన్న సేవ, 24న గరుడ సేవోత్సవం, 25న స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నారు.

700ఏళ్లుగా వెలుగుతున్న నంద దీపం

ఆలయ నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన నంద దీపం నిత్యం వెలగడం ఇక్కడి ప్రత్యేకత. గంటపై చెక్కబడిన తెలుగు అంకెల ఆధారంగా 700 ఏళ్ల క్రితం దీపం ఏర్పాటైనట్లు తెలుస్తోంది. దీపం దర్శనానికి భక్తులు రోజు వందలాదిగా తరలివస్తున్నారు. పురాతన ఆలయాన్ని 2018లో భక్తుల విరాళాలతో పునర్నిర్మించారు. ఆలయం ఎదుట ఉన్న కల్యాణ మండపం 16 స్తంభాలతో చతుర ప్రాకారంలో నిర్మించారు.

సంక్షిప్త వార్తలు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చందుర్తి: మండలంలోని మల్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్‌విండో డైరెక్టర్ నగరం శంకర్ మంగళవారం ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని కేంద్రానికి తీసుకొచ్చి తేమశాతం లేకుండా చూడాలన్నారు. రైతులు, తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. మంగళవారం సెస్ సిబ్బంది విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించారు. చెట్ల కొమ్మలు తొలగించడంతో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం ఉండదని సెస్ ఏఈ పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు.

నియామకం

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కూస రవీందర్‌ను కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అడిషనల్ ఇన్‌చార్జిగా నియమించడంపై బీసీసెల్ జిల్లా కార్యదర్శి కంచర్ల రాజు, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రాములు మంగళవారం హర్షం వ్యక్తంచేశారు. రవీందర్ నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వరికొయ్యలు కాల్చొద్దు

బోయినపల్లి: రైతులు వరి పంటను కోసిన అనంతరం వరి కొయ్యలను కాల్చొద్దని ఎంఏవో ప్రణీత కోరారు. మండలకేంద్రంలో మంగళవారం ఆమె మాట్లాడారు. మండలంలో యాసంగి సీజన్‌లో 13,200 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు తెలిపారు. వరికోతలు ఊపందుకోగా రైతులు వానాకాలం పంటల కోసం వరి కొయ్యలు కాలుస్తున్నారన్నారు. వేసవిలో వరికొయ్యలు కాల్చగా మంటలువ్యాపించి పైపులైన్లు, విద్యుత్ వైర్లు, కాలిపోయే ప్రమాదముందన్నారు. వరికొయ్యలు కాల్చకుండా రొటవేటర్‌తో దున్నితే సేంద్రీయ కార్బనం ఉత్పత్తి అయి మేలు జరుగుతుందని ఎంఏవో తెలిపారు.

కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితుల్లో లేరు

ఎల్లారెడ్డిపేట: రాష్ట్రంలో ఏ రైతు ఆనందంగా లేడని, వారి కళ్లల్లో కన్నీరు కనిపిస్తుందని జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అందే సుభాష్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదన్నారు. ఆరు అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు నర్సింహారెడ్డి, కిషన్, మధు, తదితరులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని డాక్టర్ కందేపి ప్రసాద్‌రావు పిల్లల ఆస్పత్రిలో పదేళ్ల బాలుడికి 'బి పాజిటివ్', బండి తులసికి ' ఓ పాజిటివ్', అవసరం ఉందని వాత్సల్య ఫౌండేషన్ సభ్యులను తెలపగా వారు రక్తదానం చేశారు. సంటి నవీన్, బొప్ప రాజు, నాగరాజు తదితరులున్నారు. వారిని ఫౌండేషన్ చైర్మన్ సుధాకర్, వైద్యులు అభినందించారు.

బీజేపీలో చేరిక

బోయినపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు శ్రీనివాసరెడ్డి, జనగం లక్ష్మణ్, అన్నమల్ల మోహన్ బాబు, ఇల్లెందుల బాలయ్య బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ సమక్షంలో బీజేపీలో చేరినట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ ఉన్నారు.